క్లుప్తంగా

నాసా కాంటెస్ట్ విద్యార్థులకు కిట్స్ పంపిణీ



విద్యార్థులకు కిట్స్ అందించిన ఎంఈవో రామలక్ష్మణమూర్తి

రామచంద్రపురం: ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నాసా కాంటెస్ట్ కిట్స్‌ను స్థానిక చైతన్య విద్యాసంస్థల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు రాయవరం ఎంఈఓ రామలక్ష్మణమూర్తి అందజేశారు. శ్రీచైతన్య పాఠశాలలో 24 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుల సహకారంతో రెండు ప్రయోగాలు రూపొందించినట్లు ప్రిన్సిపాల్ కె.రాము వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ రామలక్ష్మణమూర్తి విద్యార్థులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహించే ఇటువంటి పోటీ పరీక్షలకు చిన్నారులు పోటీ పడడం చాలా ఆనందదాయకమన్నారు. ప్రిన్సిపాల్ కె.రాము మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలకు శ్రీచైతన్య యాజమాన్యం ఎప్పుడు విద్యార్థులకు తగిన ప్రోత్సాహం అందిస్తూనే ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ భాగ్యరాజు, ఇన్‌చార్జ్ చారి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కపిలేశ్వరపురం: ఈ ఏడాది డిసెంబర్ నెల సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో శనివారం పంపిణీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. మండలంలోని 19 గ్రామాల్లోని వివిధ సామాజిక పింఛన్ల లబ్ధిదారుల పింఛన్ల పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్టు ఎంపీడీఓ తెలిపారు.

రాయవరం: మండలంలోని డిసెంబర్ నెలకు మంజూరు చేసిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ 1వ తేదీ ఆదివారం రావడంతో ఈ నెల 30వ తేదీనే పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో కీర్తిస్పందన తెలిపారు. మండలంలోని కేటాయించబడిన సచివాలయంలోని సిబ్బంది సంబంధిత క్లస్టర్‌కు వెళ్ళి ఉదయం 5 నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభించాలని సిబ్బందికి సూచించారు. సంబంధిత సచివాలయ సిబ్బంది 29వ తేదీనే బ్యాంకుల ద్వారా నగదు డ్రా చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయాన్ని పెన్షన్‌దారులు గమనించి శనివారమే పెన్షన్ తీసుకోవాలని చెప్పారు.

దివ్యాంగులపై ఆదరాభిమానాలు ఉండాలి



కాజులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న భవిత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది

కాజులూరు: దివ్యాంగులపై సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆదరాభిమానాలు కలిగి ఉండాలని కాజులూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పంపన కృష్ణమూర్తి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక భవిత సెంటర్‌లో దివ్యాంగులకు రన్నింగ్, లాంగ్‌జంప్ తదితర ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం యూఆర్ పద్మావతి అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వాలు అందిస్తున్న సహకారాలను వివరించారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ టీచర్ ఎం.జయప్రకాశ్‌రెడ్డి, ఒంపోలు శివ పాల్గొన్నారు.

పరకే బంగారమాయేనా...!

- యంత్రాల కోతతో ఎండుగడ్డికి కొరత
- మూగజీవాల నోరుకొడుతున్న వరికోత మెషీన్లు
- రూ.ఏడు వేలు పలుకుతున్న ఎకరం గడ్డి
- బెంబేలెత్తుతున్న పశుపోషకులు



కాజులూరులో కోత కోస్తున్న యంత్రం



గొల్లపాలెంలో వరికోత యంత్రంతో కోయడంతో చెల్లాచెదురుగా పడి ఉన్న ఎండుగడ్డి

కాజులూరు: అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగానికి విస్తరిస్తోంది. ఒకప్పుడు పంట పండించాలంటే అన్ని దశల్లోనూ రైతులకు పశువుల సహకారం తప్పనిసరి అయ్యేది. ప్రస్తుతం నాట్లు వేసే దశ నుంచి నూర్పిళ్ల వరకూ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వ్యవసాయరంగంలో పశువులకు పనిలేకపోవడమే కాకుండా వాటికి తినటానికి మేత కూడా కరువయ్యే పరిస్థితి వచ్చింది. రైతులు వరికోతలు కోసేందుకు మానవశ్రమను వీడి వరికోత మెషీన్లను వినియోగించడంతో గడ్డికి తీవ్రంగా కొరత ఏర్పడింది. దీంతో ప్రస్తుతం ఎకరం గడ్డి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు పలుకుతోంది. దాణా ధరలకు తోడు ఎండుగడ్డి పరమవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని పశుపోషకులు బెంబేలెత్తుతున్నారు. వరి పంట మాసూళ్ల అనంతరం గింజలు వేరుచేయగా వచ్చే గడ్డిని రైతులు ఎండుగడ్డిగా పిలుస్తారు. గతంలో రైతులు కూలీలతో కోత కోయించి పనలు, వద్దుకి చేర్చి నూర్పిళ్లు చేయించేవారు. నూర్పిళ్లు చేసిన పడుగులు దులిపి గింజలు వేరు చేయగా ఎకరానికి సుమారు 1.5 టన్నులు ఎండిగడ్డి వచ్చేది. ప్రస్తుతం డెల్టాలో కూలీల కొరత ఏర్పడటానికి తోడు నూర్పిడి యంత్రంతో తక్కువ ఖర్చుతోనే మాసూళ్లు పూర్తవుతుండటంతో రైతులు ఆ దిశగానే మాసూళ్లు నిర్వహిస్తున్నారు. ఈ విధానంలో కోత యంత్రం పొలంలో వరి మొక్క సుతల భాగాన్ని తుంచి గింజలను వేరు చేసి నుజ్జునుజ్జయిన గడ్డిని పొలంలోనే చెల్లాచెదురుగా పడవేస్తుంది. ఈ గడ్డి మేటు వేయడానికి, పశువులు తినడానికి పనికిరాదు. మొక్క నుంచి గింజలు వేరుచేసి గడ్డి నలిగిపోకుండా కట్టలుగా కట్టే వరికోత మెషీన్లు కొన్ని ఏరియాల్లో వాడుకలో ఉన్నప్పటికీ అవి అత్యంత ఖరీదుతో కూడుకున్నవి కావడంతో మన ప్రాంతంలో అవి వినియోగించటం లేదు. దీంతో డెల్టాలోనూ ఎండుగడ్డి కొరత ఏర్పడింది. దాళ్వా కన్నా తొలకరి గడ్డిని పశువులు ఇష్టంగా తినడంతో రైతులు తొలకరి గడ్డిని చాలా వరకు స్థానికంగా నిల్వ చేసి ఏడాది పొడవునా పశుగ్రాసంగా వినియోగిస్తుంటారు. దాళ్వాలో వచ్చే గడ్డి విశాఖ, విజయనగరం తదితర జిల్లాలకు, పేపర్ పరిశ్రమలకు ఎగుమతి అవుతుంటుంది. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండల గ్రామాల్లో సుమారు 52 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. ఎకరాకు సుమారు 1.5 టన్నుల చొప్పున 78 వేల టన్నుల ఎండుగడ్డి ఉత్పత్తి కావాల్సి ఉంది. నియోజకవర్గంలో సుమారు 25 వేల వరకు పాడి పశువులు ఉండగా ఒక్కో పాడి పశువుకు రోజుకు ఐదు కేజీల చొప్పున ఏడాదికి నలభై ఐదు వేల ఆరువందల టన్నుల ఎండు గడ్డి అవసరమవుతుంది. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌లో సుమారు సగం గడ్డి కూడా దొరికే పరిస్థితి లేకపోవడం పశుపోషకులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో గడ్డికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. గతంలో ఎకరం పొలంలోని వరిగడ్డి రూ.2500 నుంచి రూ.3000 వరకు పలికితే ఇప్పుడు గడ్డి నాణ్యతను బట్టి రూ.6000 నుంచి రూ.7000 వరకు ఉందని వ్యాపారులు, పాడి రైతులు అంటున్నారు. ఈ గడ్డిని దూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తుండటంతో రవాణాతో కలిపి ఎనిమిది వేలు వరకు ఖర్చవుతుందని వాపోతున్నారు. కొందరు రైతులు ఉన్న గడ్డి నిల్వలను దాళ్వా గడ్డి వచ్చేవరకు పరస్పరం ఒకరికి ఒకరు సర్దుబాటు చేసుకుంటుండగా కొందరు రైతులు అధిక ధరను వెచ్చించి దూరప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ఇప్పటికే దాణా, కూలి రేట్లు పెరిగి పాల ధర గిట్టుబాటుగా లేకపోవడంతో అంతంత మాత్రంగా ఉన్న పాడి పరిశ్రమ గడ్డి కొరతతో మరింత కష్టాల్లో కూరుకుపోతుందని పాడి రైతులు అంటున్నారు.

ఎండుగడ్డి కొరత వేధిస్తోంది



వరి పొలాలను వరికోత మెషీన్లతో కోత కోస్తుండటంతో ఎండుగడ్డి రావటం లేదు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడింది. ఉన్న ఎడ్డుగడ్డి నిల్వలు దాళ్వా పంట వచ్చేవరకూ సరిపడేట్టులేదు. ఎండుగడ్డికి ప్రత్యామ్నాయంగా మార్కెట్లో దాణా కొనుగోలు చేసి పెడదామన్నా పూర్తిగా చిన్న రైతులకు అది సాధ్యం కావడం లేదు.
– ద్వారంపూడి సోమిరెడ్డి, పాడి రైతు, మొగలిపాలెం

పశుపోషణ కష్టంగా ఉంది



గడ్డికి ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో దొరికే దాణాను కొనుగోలు చేసి పశువులకు పెడదామన్న వాటి ధర ఆకాశాన్నంటుతోంది. వచ్చే పాల దిగుబడి సగానికి పైగా దాణా ధరకే సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పశుపోషణ సాగించడం కష్టతరంగా ఉంది.
– సువ్వారి గోవిందు, రైతు, తర్లంపూడి

వణికిస్తున్న వరుణుడు



భట్లపాలికలో వర్షానికి తడిచిపోయిన ఆరబెట్టిన ధాన్యం

కె.గంగవరం: ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉన్న తరుణంలో ఇప్పుడు ప్రకృతి కన్నెర్ర చేస్తుందోమోనని రైతులు కలవరపడుతున్నారు. ధాన్యాగారమైన రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 6308 హెక్టార్లు, రామచంద్రపురం మండలంలో 6000 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7200 హెక్టార్లలో ఈ ఏడాది రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో కోత దశలో ఉంది. సుమారుగా 60 శాతం పంట కోత కూడా కోసి ధాన్యాన్ని రోడ్ల మీద, పొలం గట్లపై రైతులు ఆరబెట్టుకున్నారు. మరికొంత మంది రైతులు పనలను కోసి చేలోనే వదిలేశారు. ఇలాంటి పరిస్థితిల్లో తుపాను ప్రభావంతో శుక్రవారం సాయంత్రం సుమారు గంట సేపు కురిసిన వర్షానికి రైతులు ఉరుకులు పరుగులు తీశారు. అందినకాడికి అప్పులు చేసి ప్రస్తుతం పంటను సాగు చేశామని పంట చేతికందే సమయంలో వర్షాలు పడితే అప్పుల పాలైపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావం వల్ల మరో రెండు మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ వెల్లడించడంతో పాటు ఉదయం నుంచి వాతావరణం మబ్బులతో ఉండడం సాయంత్రం ఈదురుగాలులు, చినుకులు పడడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పంటను వర్షాల బారి నుంచి కాపాడుకోవడానికి ప్రస్తుతం రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ఎన్నికల కోడ్ అమలు చేయని అధికారులు

ఎక్కడికక్కడ ఫ్లెక్సీల దర్శనం



అంగర గాంధీ సెంటర్‌లో అధికార పార్టీ నాయకులతో దర్శనమిస్తున్న ఫ్లెక్సీ

కపిలేశ్వరపురం: ఉభయ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఎన్నికల ఏర్పాట్లలో ఉన్నతాధికారులు బిజీగా ఉన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలంటూ మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో కోడ్ అమలు అంతంతమాత్రంగానే ఉంది. కేవలం రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను క్లాత్‌తో కప్పి మాత్రమే ఉంచారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల అధినాయకులు, నియోజకవర్గం, మండల స్థాయి నాయకుల ఫొటోలతో ఉన్న రాజకీయ ఫ్లెక్సీలు అనేకం దర్శనమిస్తున్నాయి. ఫ్లెక్సీలను తొలగించాలంటూ తాను మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు పాలింగ్ కిశోర్‌కుమార్ అన్నారు. గ్రామాల్లో కోడ్ నిబంధనలను పక్కాగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

లెప్రసీ వ్యాధిగ్రస్తులకు భోజనాలు



లెప్రసీ వ్యాధిగ్రస్తులకు భోజనాలు అందిస్తున్న వెంకటేశ్వర్లు తదితరులు

రామచంద్రపురం: స్థానిక లెప్రసీ కాలనీలో జరిగిన డీపీఎంఆర్ కేసెస్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏరుపల్లి సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న సత్యవేణి 30 మంది లెప్రసీ వ్యాధిగ్రస్తులకు భోజన సదుపాయం కల్పించారు. జిల్లా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అని తలచి అన్నదానం ఏర్పాటు చేసిన సత్యవేణిని అభినందించారు. తన 30 ఏళ్ల సర్వీస్‌లో ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం ముందుకు వచ్చి లెప్రసీ పేషెంట్లకు ఇటువంటి అన్నదానం చేయడం ఇదే మొదటిసారి అని అన్నారు. రిటైర్డ్ డీపీఎంవో గొల్లపల్లి కృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందినా మీకు సేవలు చేయటంలో ఎప్పుడూ ముందుంటామని ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఫోన్ చేస్తే కావాల్సిన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడానికి తనతో పాటుగా రిటైర్డ్ డీపీఎంఓ కృష్ణారావు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏరుపల్లి సచివాలయం సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సత్యవేణి అభినందించి ఆమెను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో మేము కూడా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటామన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధన



మాచవరంలో మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాయవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు వన సమారాధన నిర్వహించారు. 1993–94 బ్యాచ్ విద్యార్థులు సోమేశ్వరం వంతెన వద్ద ఉన్న కొబ్బరితోటలో వన సమారాధన నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తాడి కొండారెడ్డి, సవరాల తాజాలత, మండ ధనలక్ష్మి, బిక్కిన రామకృష్ణ, పదాల సత్యం తదితరులు పూర్వ విద్యార్థులను ఒకే వేదిక మీదకు తీసుకుని వచ్చారు. మూడు దశాబ్దాల అనంతరం వీరంతా కార్తిక మాసాన్ని పురస్కరించుకుని కలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలుసుకున్న వీరంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అందరూ కలిసి మరోసారి గ్రూపు ఫొటో దిగారు.

ముగిసిన ఆధార్ ప్రత్యేక శిబిరాలు



అంగర శ్రీసిద్ధార్థ కళాశాలలో విద్యార్థుల ఆధార్ నవీకరణ ప్రక్రియలో అధ్యాపకులు

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో చేపట్టిన ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 19 నుంచి శుక్రవారం వరకూ నిర్వహించిన శిబిరాల్లో 133 మంది విద్యార్థుల వివరాలను నవీకరించారు. విద్యార్థులకు ప్రభుత్వాల నుంచి సాయం అందించే క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఆధార్ నవీకరణ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటి వరకూ కపిలేశ్వరపురం, మాచర, వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోనూ, తాతపూడి, టేకి –2, కాలేరు, వెదురుమూడి, వాకతిప్ప నల్లూరు, కోరుమిల్లి సచివాలయాల్లోనూ, అంగరలోని శ్రీసిద్ధార్థ కళాశాలలోనూ ప్రత్యేక ఆధార్ వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో కపిలేశ్వరపురం, వల్లూరు, టేకి సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి మల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర తదితరులు సేవలందించారు.

కామ్రేడ్ పరంజ్యోతికి ఘనివాళి



పరంజ్యోతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

రామచంద్రపురం రూరల్: నిరంతరం పీడిత ప్రజల పక్షాన పోరాటం చేసిన కామ్రేడ్ గుర్రాల పరంజ్యోతి ఆశయ సాధనలో ముందుకు సాగాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జె.సత్తిబాబు పిలుపునిచ్చారు. మండలంలోని భీమక్రోసుపాలెంలో అఖిల భారత రైతు కూలి సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పేద ప్రజల నాయకుడు గుర్రాల పరంజ్యోతి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు పరంజ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పరంజ్యోతి నిరంతరం పీడిత ప్రజల జీవితాల మార్పు కోసం, వాళ్ల సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేశారని భీమక్రోసుపాలెంలో కూలి రేట్ల కోసం ల్యాండ్ సీలింగ్ భూమిలు పేదలకు పంపిణీ చేయాలని, రొయ్యల చెరువులను వ్యతిరేకిస్తూ అనేక పోరాటాల సాగించి ప్రజల చైతన్యపరిచి నిలబెట్టారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు యన్నం నాగేంద్రకుమార్, గ్రామ కమిటీ సభ్యులు విప్పర్తి సుబ్బలక్ష్మి, పోతురాజు సీత, గుండేపల్లి రాజేశ్వరి, సాధనాల వెంకటలక్ష్మి, విప్పర్తి సూరమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సోమేశ్వరునికి అఖండ కార్తిక దీపారాధన



సోమేశ్వరంలో భక్తుల అఖండ కార్తిక దీపారాధన



నేలటూరులో స్వామి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

రాయవరం: సోమేశ్వరంలోని చారిత్రక బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అఖండ కార్తిక దీపారాధన చేశారు. శివస్వాముల ఆధ్వర్యంలో చేపట్టిన కార్తిక దీపారాధన సందర్భంగా స్వామికి ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. రాత్రి సమయంలో ఆలయ ఆవరణలో అఖండ కార్తిక దీపారధన చేపట్టారు. శివలింగం, త్రిశూలం, ఢమరుకం తదితర ఆకారాల్లో దీపాలను ఏర్పాటు చేసి చేపట్టిన అఖండ దీపారాధన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజల్లో సర్పంచ్ ఆరిఫ్, మాజీ సర్పంచ్ వైఆర్‌కే పరమహంస, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో శివస్వాములు పాల్గొన్నారు.

నేలటూరులో మాస శివరాత్రి పూజ

కపిలేశ్వరపురం: నేలటూరులో శుక్రవారం 250వ మాస శివరాత్రి పూజ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని నీలాంబికా సమేత బసవేశ్వర స్వామి ఆలయ కల్యాణ మంటపంలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అల్లం సత్యనారాయణ వీరరాఘవులు, వీర బసవ శంకరరావు, శ్రీను, సత్యవతి, చల్లా వీరవెంకట సత్యనారాయణ, వీరసత్యవేణి ఆర్థిక సౌజన్యంతో అన్నదానం చేశారు. భక్తులు ఓం నమఃశివాయ నామాన్ని జపించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 20 సంవత్సరాల 11 నెలలుగా గ్రామంలో మాస శివరాత్రి పూజలను చేస్తున్నామన్నారు.

కనుల పండువగా దీపోత్సవం



ద్రాక్షారామ మహాదేవుడి ఆలయంలో జరిగిన దీపోత్సవం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని సాక్షివారి వీధిలో వేంచేసిన మహాదేవుని ఆలయం వద్ద కార్తిక మాసాన్ని పురస్కరించుకుని దీపోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన శివలింగాకృతి దీపస్తంభంపై దీపాలు పెట్టి భక్తులు వెలిగించారు. మాసశివరాత్రి సందర్భంగా ఉదయం సాయంత్రం మహాదేవునికి పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

భీమేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి



ద్రాక్షారామలో వేదపండితుల ఆశీర్వచనాలు తీసుకుంటున్న హైకోర్టు జడ్జి సుజాత తదితరులు

రామచంద్రపురం రూరల్: ఏపీ హైకోర్టు జడ్జి వి.సుజాత కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో ఏవీ దుర్గాభవాని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మహిళా విద్యతోనే సమాజం పురోగతి

కాజులూరు: ఒక పురుషుడు విద్యనభ్యసిస్తే తాను మాత్రమే విద్యావంతుడవుతాడని ఒక మహిళ విద్యనభ్యసిస్తే తనతో పాటు కుటుంబం, తాద్వారా సమాజం విద్యవంతులవుతారని తాళ్లరేవు బీమాబాయి మహిళా మండలి అధ్యక్షురాలు వాసంశెట్టి నందివర్ధిని అన్నారు. మహిళలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచార ఉద్యమ కార్యక్రమంలో బాగంగా 16 రోజుల పాటు బీమాబాయి మహిళామండలి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించి మహిళా విద్య ఆవశ్యకతను వివరిస్తున్నారు. శుక్రవారం ఆర్యావటంలో నందివర్ధిని, మహిళామండలి సభ్యులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్లకార్డులతో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి సభ్యులు జి.రామయ్యశెట్టి, అర్జునరావు, కనకాంబరం, శివశంకర్, చంద్రకళ, అనితకుమారి, లోవకుమారి, నూక లక్ష్మి, ధనలక్ష్మి, స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మండపేట మున్సిపల్ అధికారులు

కమిషనర్	9849905809
మేనేజర్	9849908186
డీఈ	9849769340
ఏఈ	9849906527
ఆర్వో	9849743832
ఆర్ఐ	7702155588
టీపీవో	9849986208
ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్	9849986209
ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్	9849639629
జేడీ పశు సంవర్ధక శాఖ	8985488562
హౌసింగ్ డీఈ	7093930423
హౌసింగ్ ఏఈ టౌన్	7093930491
రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్	9440796537
టౌన్ ఎస్సై	8332957926
లేబర్ ఆఫీసర్	9492555059
ఫైర్ ఆఫీసర్	9963727741
ఇన్‌చార్జ్ ఆర్టీవో	9154294653
పోస్టుమాస్టర్	08855231890
ఎక్సైజ్ సీఐ	9440902412
సబ్ రిజిస్ట్రారు	7093921407

రామచంద్రపురం మండల పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీ	మొబైల్ నంబర్
చోడవరం	9866740498
హసన్‌బాద	8790133599
తాళ్లపొలం	9908027936
ఉండూరు	8790133599
ద్రాక్షారామ	9959213643
వెల్ల	9876543812
నెలపర్తిపాడు	9491270864
నరసాపురపుపేట	9493796949
జగన్నాయకులపాలెం	9491270864
కందులపాలెం	9010557125
వేగాయమ్మపేట	9492968899
వెలంపాలెం	9959213643
వెంకటాయపాలెం	9701214556
అన్నాయిపేట	8885983334
ఆదివారపుపేట	9494551915
బాపనయ్యచెరువు	8985767615
భీమక్రోసుపాలెం	9014991933
ఉట్రుమిల్లి	8096536325
తోటపేట	9030806987
కాపవరం	9493796949
మాలపాడు	9493639217
ఓదూరు	9553470700
తాడిపల్లి	9666821831
యనమదల	9908280889
ఏరుపల్లి	9177932534